ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
బుధవారం 9 అక్టోబరు 2024

ఇంద్రాణిగా చాముండేశ్వరి



మైసూరు దసరా ఉత్సవాల్లో ఆరోరోజు మంగళవారం చాముండేశ్వరి దేవి ఇంద్రాణి అలంకరణలో దర్శనమిచ్చారు. విశేష పూజల అనంతరం ఉత్సవ మూర్తికి ప్రాకారోత్సవం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



శిడ్లఘట్టలో కాళికాంబ కమఠేశ్వర ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు.



బెంగళూరు నగరంలోని బనశంకరి ఆలయంలో అమ్మవారిని గోమేధిక ఆభరణాలతో అలంకరిచడం విశేషంగా ఆకట్టుకుంది.



పద్మనాభుడి అలంకరణలో శ్రీసత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి భక్తులను అనుగ్రహించారు.

దేశీయ వంగడాల రక్షణకు
విత్తనబ్యాంకు



- సేకరణ, సంరక్షణే లక్ష్యం
- అన్నదాతకు శిక్షణ, మార్కెటింగ్‌కు ప్రాధాన్యం
- కృషిమేళాల ఏర్పాటు.. ఆన్‌లైన్‌లో అమ్మకాలు..
- సంప్రదాయ పంటలను కాపాడాలని ప్రభుత్వం నిర్ణయం
- తొలి విడతగా రూ.5కోట్ల నిధులు కేటాయింపు

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంప్రదాయ పంటలసాగుకు శతాబ్దాల చరిత్ర ఉంది. అయితే హైబ్రీడ్ వంగడాల రాకతో పురాతన పంటలు కనుమరుగవతున్నాయి. వందలాది రకాల పంటలను హైబ్రీడ్ పద్ధతిలోనే పండిస్తున్నారు. కనుమరుగవుతున్న దేశీయ, సంప్రదాయ వంగడాల రక్షణకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. దేశీయ వంగడాలను కాపాడడం, వాటి మనుగడ కొనసాగించడం తోపాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా విత్తనబ్యాంకును ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

రూ.5కోట్ల కేటాయింపు

వ్యవసాయశాఖ ఈ ఏడాది దేశీయ వంగడాల సంరక్షణ కోసం 5 కోట్ల రూపాయలు కేటాయించింది. రానున్న ఐదేళ్లలో నిధుల కేటాయింపుతోపాటు పురాతన వంగడాలను గుర్తించి సంరక్షించే ప్రక్రియ కొనసాగించదలిచింది. ఏకదళ, ద్విదళ ధాన్యాలతో పాటు కూరగాయల్లో వేలాది రకాల దేశీయ వంగడాలు ఉన్నాయి. ప్రతి పంట ఉత్పత్తిలోనూ రుచి, రంగుతోపాటు ఔషధగుణాలు ఉంటాయి. వాటిని సంరక్షించాలని నిర్ణయించారు. దేశీయ వంగడాలను సంరక్షణ, సేకరణ చేసేందుకు తొలి ఏడాది రైతులకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత విడతలవారీగా రైతులకు స్థానిక దేశీయవంగడాలతో సాగు చేసేలా ప్రోత్సహిస్తారు.

దేశీయ వంగడాలకే ప్రాధాన్యం

దేశీయ వంగడాల సంరక్షణకు ప్రధాన కారణం హైబ్రీడ్ వంగడాల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. భూమి సారవంతం కోల్పోతోంది. దేశీయ వంగడాలతో రోగ నిరోధకశక్తి, తక్కువ నీటితోనే పంటలసాగు చేసేందుకు వీలుంటుం ది. ఇందుకోసమే దేశీయ వంగడాలను సంరక్షించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రతి జిల్లా, ప్రాంతాలవారీగా వాతావరణ మార్పులున్నాయి. మలెనాడులో సాగు చేసే పంటలు తీరప్రాంత జిల్లాల్లో సాధ్యం కావు. ఇక ఉత్తర కర్ణాటక జిల్లాల్లో సాగు చేసే పంటలు రాష్ట్రంలో ఎక్కడా పండించరు. కోలారు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, చిత్రదుర్గ జిల్లాల్లో మెట్టభూములే ఎక్కువ. గడిచిన దశాబ్దన్నర కాలంగా తృణధాన్యాల సాగు పెరుగుతోంది. రైతులకు మార్కెటింగ్ సులభతరంతోపాటు గిట్టుబాటు సాధ్యమవుతుండడంతో వీటిపై ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో వరి, చెరుకు, రాగి, జొన్నలు ప్రధాన పంటలుగా ఉన్నాయి. ఇక వాణిజ్యపంటల్లో ప్రాంతాలవారీగా భిన్నంగా సాగు చేస్తున్నారు. అలసంద, పెసర, కంది, మినుములతో పాటు పలు పంటలు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ సాగు చేస్తారు. ఇటీవలికాలంలో తృణధాన్యాల సాగు, సేంద్రియ ఎరువుల వాడకంపై పలు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. నేరుగా పల్లెలకు వెళ్లి రైతు సంఘాలు ప్రాంతాలవారీగా సమాఖ్యలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నారు. ఐదారేళ్లుగా ఏటా అంతర్జాతీయస్థాయిలో సిరిధాన్యాల మేళా నిర్వహిస్తుండడం ద్వారా ఎన్నో పంట దిగుబడులను ఆధునిక యువత తెలుసుకునే అవకాశం ఏర్పడింది. వాటిని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లాలన్నదే విత్తనబ్యాంకు ఆశయంగా ఉంది.

శిక్షణ ఇలా...

దేశీయ వంగడాల సంరక్షణకోసం విత్తనబ్యాంకును ఏర్పాటు చేయదలిచిన ప్రభుత్వం ప్రాంతాలవారీగా రైతులకు శిక్షణ ఇవ్వనుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు పరిశోధనా సంస్థల ద్వారా ప్రాంతాలవారీగా ఎంపిక చేసిన తగిన వంగడాల అభివృద్ధికి శిక్షణ ఇస్తారు. కనుమరుగవుతున్న వంగడాలను ప్రాంతాలవారీగా ఎంపిక చేసి వాటిని గుర్తిస్తారు. అనంతరం వాటి ద్వారానే పంటలసాగుకు ప్రోత్సహిస్తారు. పూర్తిస్థాయిలో ఎకరాల కొలదీ సాగు కాకుండా వారికున్న భూమిలో కొంతమేర ప్రాచీన వంగడాలను సాగుచేసేలా సూచిస్తారు. అందుకు ప్రత్యేకంగా రైతులకు ప్రోత్సాహకం ఇస్తారు.



ఐదేళ్లలో సమగ్ర కార్యాచరణ : మంత్రి



దేశీయ వంగడాల మనుగడ అవసరమని, వీటిలో రోగనిరోధకశక్తి ఉంటుందని రాష్ట్రంలో ఐదేళ్లలో సమగ్ర కార్యాచరణ కొనసాగించదలిచామని వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి అభిప్రాయపడ్డారు. తక్కువనీటితో సాగుకు అనుకూలం కానుందని, అధిక దిగు బడితో పాటు రైతులకు పుష్కలంగా లాభాలు గడిం చేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



పౌష్టికాంశాలకే ప్రాధాన్యం..

దేశీయ వంగడాలలో పౌష్టికాంశాలు ఎక్కువగా ఉండడం వలన మంచి ఆహార పదార్థాలకు అనుకూలమని వ్యవయసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. అందుకే ఏకదళ, ద్విదళ పంటలతోపాటు సిరిధాన్యాలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. వరి, రాగి, జొన్న, కంది, ఉద్దులు, కొండ ఉద్దులు, కుసుమలు, నువ్వులు, నాలుగైదు రకాల జొన్నలు, అనప, నవనె, సామలు, కొర్రలతో పాటు పదికిపైగా ప్రాచీన వంగడాలను గుర్తించదలిచారు. ప్రతిప్రాంతంలోనూ కనీసం 50మంది రైతులను గుర్తించి వారి ద్వారా సాగు చేయించదలిచారు. కృషిమేళాలో వారికి ప్రత్యేక అవకాశాలు ఇస్తారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థను కల్పిస్తారు. దేశీయ వంగడాలకు జీఐ ట్యాగ్ గుర్తించి స్థానిక మార్కెట్‌లలో విక్రయించుకునే వెసలుబాటు కల్పిస్తారు. ఈ విధానం అమలుకు రెండు కమిటీలను ఏర్పాటు చేయదలిచారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు పనిచేయనున్నాయి.

దేశీయ వంగడాలలో దిగుబడులలో పౌష్టికాంశాన్ని పెంచదలిచారు. అందుకోసం మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ), హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ద్వారా పరిశోధనలు చేయదలిచారు. ఆ తర్వాత ఎక్కువ ప్రచారంతో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దేశీయ సంప్రదాయ వంగడాలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందించదలిచారు.

153
ఎకరాల్లో ఉద్యానవనం

- కబ్బన్‌పార్క్ తరహాలో మరోటి..
- వృక్షమాత సాలుమరద తిమ్మక్క పేరు
- రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వరఖండ్రే



సాలుమరద తిమ్మక్క

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిత్యం వేలాదిమందికి స్వచ్ఛమైన గాలితోపాటు వాకింగ్‌కు అనుకూలంగా ఉండే కబ్బన్‌పార్క్ తరహాలోనే మరో విశాలమైన పార్కును ఏర్పాటు చేయనున్నారు. కబ్బన్‌పార్క్ అంటే నగర ప్రజలకు ఎంతో ఇష్టమైన ప్రదేశం. నగర నడిబొడ్డున ఉండడం, మెట్రోకు అనుసంధానం, హైకోర్టు, విధానసౌధతోపాటు ఎంజీ రోడ్డు సమీపాన ఉండడంతో ఇక్కడ వాకర్స్ కాకుండా మధ్యాహ్నం, సాయంత్రం వేళ సరదాగా గడిపేందుకు నిత్యం వేలాదిమంది వస్తుంటారు. నగరం వేగవంతంగా విస్తరిస్తున్న తరుణంలో గార్డెన్‌సిటీ ఉనికి కోల్పోతోంది. ఎకోస్పేస్ అభివృద్ధి చేయాలని రాష్ట్ర అటవీశాఖ భావిస్తోంది. ఇదే తరహాలో యలహంక సమీపంలో 153 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ పార్క్‌కు వృక్షమాత సాలుమరద తిమ్మక్క పేరు పెట్టనున్నట్లు అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ఇటీవల తెలిపారు. యలహంకలో 153 ఎకరాల భూమి అటవీశాఖకు అనుబంధంగా ఉందన్నారు. అటవీ అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. బెంగళూరు ఉత్తర ప్రాంత ప్రజలకు ఇది అనుకూలం కానుందన్నారు. తిమ్మక్క హులికల్, కుదూరుల మధ్యన 45 కిలోమీటర్ల దూరంలో 385 మర్రిచెట్లు నాటారని అవి ప్రస్తుతం భారీగా పెరిగాయన్నారు. మర్రిచెట్లను బిడ్డలుగా పెంచిన మేరకు వృక్షమాతగా పేరొచ్చిందన్నారు. 2019లో పద్మశ్రీ పురస్కారం దక్కిందన్నారు. ఆమె గౌరవార్థం పార్కుకు ఆమె పేరును పెట్టాలని నిర్ణయించామన్నారు.



సంబరాల్లో బీజేపీ కార్యకర్తలు

హరియాణాలో విజయం పట్ల
బీజేపీ సంబరాలు

- ఓటమిని అంగీకరిస్తాం: డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ విజయంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర హర్షం వ్యక్తం చేశారు. మల్లేశ్వరంలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ హరియాణాలో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ సాధ్యమయ్యిందని, మేథావివర్గ ప్రజలు ప్రధానమంత్రి మోదీ నాయకత్వాన్ని సమర్థించారన్నారు. రాష్ట్రంలో ఐదు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చెత్తబుట్టలో వేసిందన్నారు. రాష్ట్రప్రభుత్వం అవినీతిలో పీకల్లోతుల్లో కూరుకుపోయిందన్నారు. అనంతరం కార్యకర్తలు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ప్రతిపక్షనేత అశోక్, చలవాది నారాయణస్వామి, సీటీ రవి, మహేశ్, మునిస్వామితోపాటు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. హరియాణాలో ఓటమిపై డీసీఎం డీకే శివకుమార్ స్పందించారు. కాంగ్రెస్ ఓటమిపై మాట్లాడుతూ ప్రజాతీర్పును శిరసావహిస్తామన్నారు. ఎక్కడ తప్పు చేసిందో పరిశీలిస్తామన్నారు. జమ్ము - కశ్మీర్‌లో గెలుపు సాధ్యమైందన్నారు.

జెన్నీమిల్క్ కేసులో ముగ్గురి అరెస్టు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 8: గాడిద పాల వ్యాపారం పేరుతో రైతులను మోసం చేసిన జెన్నీమిల్క్ ప్రతినిధులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. విజయనగర జిల్లాఎస్పీ సూపరింన్‌డెంట్ బి.ఎల్.హరిబాబు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జెన్నీమిల్క్ కంపెనీ 318 మందికి పైగా రైతులను మోసం చేసిందని, రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సంస్థకు చెందిన ఐదు బ్యాంకు ఖాతాలు(హొసపేటలో మూడు, ఆంధ్రాలో రెండు) జప్తు చేశామని, నిందితుల ద్వారా మరింత సమాచారం రాబడ్తామన్నారు. అరెస్టు అయిన నిందితుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వేదాయపాళ్యం గ్రామానికి చెందిన నూతలపాటి మురళి, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కడప జిల్లా గాలి వీడు గ్రామానికి చెందిన కవలపల్లి ఉమాశంకర్ రెడ్డి, కంపెనీ మేనేజర్ పోరుమామిళ్లకు చెందిన సయ్యద్ మహ్మద్ గౌస్ ఉన్నారు. కేసును సీఐడీకి అప్పగిస్తామన్నారు. ఈ మేరకు నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



నిందితులు నూతలపాటి మురళి, ఉమాశంకర్ రెడ్డి, మహ్మద్ గౌస్

ఎమ్మెల్యే వినయ్ కులకర్ణిపై ఎఫ్ఐఆర్



బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ధారవాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మహిళా రైతుపై అత్యాచార ఆరోపణలపై బెంగళూరు సంజయ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్యాచారం, వేధింపులు, ప్రాణహాని, వంచన వంటి ఆరోపణలతో ఐపీసీ సెక్షన్ 506, 504, 201, 366, 376, 323 సహా ఐటీ యాక్ట్ తదితర సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. 34ఏళ్ల బాధితురాలిని మెడికల్ చెకప్‌కోసం కేసీ జనరల్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై వినయ్‌కులకర్ణి స్పందిస్తూ ఆమెను తాను కనీసం తాకలేదని, ఇదంతా కుట్ర అని పేర్కొన్నారు.

నవరతన్ షోరూంలలో బొమ్మల కొలువు

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేలా నవరతన్ జ్యువెలరీ సంస్థ ప్రతి షోరూంలోనూ దసరా బొమ్మల కొలువును ఏర్పాటు చేసింది. బొమ్మల కొలువును నవరతన్ ఎండీ గౌతమ్‌చంద్ బప్నా, సీఓఓ ప్రకాశ్‌బప్నాలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ గౌతమ్‌చంద్ బప్నా మాట్లాడుతూ తొలిసారిగా నవరతన్‌లో బొమ్మల కొలువు ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ఆసక్తితో సర్వాంగ సుందరంగా తీర్చామన్నారు. బొమ్మల కొలువులో రాచరికం, ఆధ్యాత్మికానికి అనుబంధమైన కథలు ఉంటాయన్నారు. ఎంజీ రోడ్డు, జయనగర్, రాజాజీనగర్, యలహంక శాఖల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేశామన్నారు. క్రికెట్, మిలిటరీ, నవరాత్రుల ఆచరణ, నవదుర్గా కథల పరికల్పనతో బొమ్మల కొలువుతీర్చామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం వినియోగదారులతో స్వయంగా పూజలు నిర్వహిస్తు న్నామన్నారు.



బొమ్మలకొలువులో సంస్థ ఎండీ గౌతమ్‌చంద్ బప్నా తదితరులు


విజయవాడలో కృష్ణానది యాజమాన్యం బోర్డు

- ఏపీ సాగునీటి వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ప్రతిపాదన

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్యం బోర్డు విజయవాడలోనే ఏర్పాటు చేయాలని ఏపీ సాగునీటి వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ప్రతిపాదించారు. బెంగళూరులో దక్షిణభారత సంయుక్త కిసాన్ మోర్చా సదస్సు జరిగింది. ముగింపు రోజు వివిధ రాష్ట్రాల తరపున హాజరైన ప్రతినిధులు వారి రాష్ట్రాల ప్రతిపాదనలు వినిపించారు. ఆంధ్రప్రదేశ్ బృందం తరపున పాల్గొన్న ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సాగునీటి సంఘాల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. కృష్ణానదీ యాజమాన్యబోర్డు విజయవాడలో ఏర్పాటు సముచితమని అభిప్రాయపడ్డారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటిపారుదల వ్యవస్థ, యాజమాన్యాల చట్టం తీసుకొచ్చారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలవనరుల విభాగాన్ని నిర్వీర్యం చేశారని, నీటి సంఘాల వ్యవస్థను రద్దు చేశారన్నారు. నీటి యాజమాన్యంలో రైతుల భాగస్వామ్యం ఎక్కువ ఉండడం వలన నీటి సంఘాల ప్రతినిధులు 'నీరు - చెట్టు' కార్యక్రమంలో భాగంగా చెరువులలో పూడిక తీత, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కాలువలలో పూడిక తీత, వ్యవసాయ కుంటల నిర్మాణం ద్వారా రాష్ట్రంలో 7 లక్షల ఎకరాల ఆయకట్టు అదనంగా పెరిగిందన్నారు. 90 టీఎంసీల భూగర్భ జలాలు అదనంగా స్వీకరించబడ్డాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా అభ్యంతరం లేకుండా విజయవాడలోనే కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ కేంద్రజలశక్తి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



సంయుక్త కిసాన్ మోర్చా సదస్సులో ప్రముఖులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,616.28
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,954	2,235
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,654	9,356
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	51.52

కొల్కి లక్ష్మీకాంత్‌కు 'శిక్షణ ప్రకాష్' అవార్డు



బళ్లారి సిటీ, అక్టోబరు 8: విద్యానగర్‌లోని శ్రీనంద రెసిడెన్షియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్కి లక్ష్మీకాంత్ 2024-25 సంవత్సరానికిగాను రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయుడిగా శిక్షణ ప్రకాష్ అవార్డుకు ఎంపికయ్యారు. బెంగళూరు సూర్య ఫౌండేషన్, స్పార్క్ అకాడమీ బెంగళూరు వారు చురుగ్గా పనిచేస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తగిన మార్గనిర్దేశం చేస్తున్నవారికి ఈ అవార్డు ఇస్తారు. ఈసందర్భంగా శ్రీనంద పాఠశాల పాలకమండలి, సిబ్బంది ఆయనను అభినందించారు.

వ్యాన్ బోల్తా - ఒకరి మృతి



చిందరవందరగా పడిన భోజన సామగ్రి

బళ్లారిరూరల్, అక్టోబరు 8 : తాలుకాలోని సింధువాళం క్రాస్ ఎల్‌ఎల్‌సీ కాలువవద్ద హరికేరి గ్రామానికి 30 మంది కూలీలతో వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి కింద పడటంతో మోకా గ్రామానికి చెందిన 13 సంవత్సరాల యువకుడు రఘు అక్కడికక్కడికే మృతి చెందాడు. 25 మందికి పైగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై మోకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మోకా సమీపంలోని సింధువాళం సమీపంలో ప్రమాద స్థలాన్ని మంగళవారం సందర్శించిన ఎస్పీ ప్రమాదంపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎస్పీ వెంకటేష్, సీఐ రుద్రప్ప, ఎస్ఐ కాళింగ ఉన్నారు.

హగరి ఆర్టీవో చెక్‌పోస్టుపై లోకాయుక్త దాడులు



హగరి ఆర్టీవో చెక్‌పోస్టు

బళ్లారిరూరల్, అక్టోబరు 8 : హగరి సమీపంలో ఉన్న ఆర్టీవో చెక్‌పోస్టు కార్యాలయంపై మంగళవారం తెల్లవారుజామున లోకాయుక్త ఎస్పీ సిద్దరాజ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సంగమేష్, మహమ్మద్ రఫీక్‌లు దాదాపుగా 20 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. చెక్‌పోస్టులోని ఫైల్స్‌ను పరిశీలించారు. చెక్‌పోస్టులో డబ్బును పరిశీలించి, రూ. 41 వేలు ఎక్కువగా వుందని కేసు నమోదు చేశారు. ఈ చెక్‌పోస్టుతో పాటు రాష్ట్రంలో అన్ని చెక్‌పోస్టులలో మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించారని లోకాయుక్త అధికారులు తెలిపారు.

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరెక్టర్ పోస్టులకు నామినేషన్లు

సిరుగుప్ప, అక్టోబరు 8 : నేటి నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరెక్టర్లకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి దేవేందర్ గౌడ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్జీవో భవనంలో 18వ తేదీ వరకు నామినేషన్లు 19న నామినేషన్ల పరిశీలన, 21 తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ, 28వ తేదీ పోలింగ్ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. 34 మంది డైరెక్టర్లను ఎన్నుకోవడం కోసం ఈ ఎన్నికలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవో అధ్యక్షులు లింగరాజరెడ్డి, వివిధ సంఘం పదాధికారులు పాల్గొన్నారు. అనంతరం నవంబరు 16వ తేదీన అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని ఎన్జీవో అధ్యక్షులు లింగరాజరెడ్డి తెలిపారు.

వాల్మీకి జయంతిని ఘనంగా ఆచరిద్దాం

సిరుగుప్ప, అక్టోబరు 8: ఈ నెల 17వ తేదీన వాల్మీకి జయంతి ఆచరిస్తున్నట్లు తహసీల్దార్ విశ్వనాథ తెలిపారు. సిరుగుప్ప పట్టణం శిశుఅభివృద్ధి యోజన కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలపై మంగళవారం ముందస్తుసమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గత యేడాది మాదిరిగానే వాల్మీకి జయంతిని ఆచరిస్తున్నట్లు కోరారు.

మారిన రాజకీయ పార్టీల వ్యూహం

● సండూరు ఉప సమరంలో బీజేపీ, కాంగ్రెస్ ఎత్తుకుపైఎత్తులు



బళ్లారి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికలలో గెలుపుకోసం అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీజేపీ రాజకీయ పాచికలు వేస్తున్నాయి. ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా శాసనసభ ఉపఎన్నికలపై ఈ పార్టీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. జేడీ(ఎస్)కు ఎలాగూ బీజేపీతో మైత్రి ఉంది కాబట్టి ఇక్కడ కూడా ఆపార్టీ బీజేపీకే మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. ఎమ్మెల్యేగా గెలుపొందిన తుకారాం బళ్లారి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన నేపథ్యంలో సండూరులో ఉప ఎన్నికలు జరపడం అనివార్యమైన విషయం విదితమే.

రాష్ట్రంలోనే సండూరుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది రాజులు ఏలిన ప్రాంతం. సండూరు రాజులకు పూర్వం నుంచి రాజకీయంగా ఎంతో పేరుప్రతిష్టలు ఉన్నాయి. ఎంవై గోర్పడే వారసులు 2004లో బీజేపీలో చేరారు. అయితే లాడ్ ఫ్యామిలీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతోంది. లాడ్ ఫామిలీకి చెందిన సంతోష్‌లాడ్ 2004లో జేడీఎస్ నుంచి కూడ్లిగి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. అలాగే అనీల్ లాడ్ కూడా 2004లో కంప్లి ఎమ్మెల్యేగా బీజేపీ నుండి పోటీ చేసి గెలిచారు. ఇక్కడ లాడ్ ఫ్యామిలీ, ఎంవై గోర్పడే ఫ్యామిలీ ఆధారంగానే రాజకీయం నడుస్తుంది. మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా లాడ్ ఫ్యామిలీ, గోర్పడే ఫ్యామిలీలు పార్టీలుగా మారాయి. కాంగ్రెస్‌లో ఉండే గోర్పడే ఫ్యామిలీ 2004లో బీజేపీలో చేరారు. అప్పటి వరకూ బీజేపీ, జేడీఎస్ పార్టీలో ఉండే లాడ్ ఫ్యామిలీలోని అనీల్ లాడ్, సంతోష్ లాడ్ కాంగ్రెస్‌లో చేరారు. ఆ తరువాత అనీల్‌లాడ్ జేడీఎస్‌లో చేరారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఖాళీ ఏర్పడిన 3 ఎమ్మెల్యే స్థానాలకు ఒక ఎంపీ స్థానానికి ఎన్నికల సంఘం ఏక్షణంలోనైనా నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.



దేవేంద్రప్ప, అన్నపూర్ణ తుకారాం, దివాకర్

కాంగ్రెస్ నుండి తుకారాం భార్య అన్నపూర్ణ తుకారాంను బరిలో దించాలని కాంగ్రెస్ భావిస్తోందని పార్టీవర్గాల సమాచారం. బీజేపీ నుంచి మాజీ ఎంపీ దేవేంద్రప్ప, అలాగే ఇంతకు ముందు ఎన్నికల్లో కేఆర్‌పీపీ నుండి పోటీ చేసి ఓడిన దివాకర్‌లతో పాటు మరో 10 మంది వరకూ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో తిరిగి సండూరును గెలుచుకోవాలని పట్టుదలతో ఉంది. ఇందుకు సంతోష్ లాడ్ నాయకత్వం వహించే అవకాశం ఉంది. బీజేపీలో మాజీ మంత్రి శ్రీరాములు పేరు వినిపిస్తున్నా శ్రీరాములు మాత్రం ఉప ఎన్నికల్లో ససేమిరా పోటీ చేయను అని బహిరంగంగానే చెబుతున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి తన సొంత పార్టీని బీజేపీలో విలీనం చేశారు. ఆయనను బళ్లారి జిల్లాలో కూడా ఉండేందుకు కోర్టు అనుమతించడం కొత్త రాజకీయ పరిణామంగానే చెప్పవచ్చు. గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారికి వచ్చాక ఇప్పటికే సండూరులో రెండు దఫాలు పర్యటించారు. ఇందులో ప్రధానంగా రాజకీయ కోణం ఉంది.

ఇక మంత్రి సంతోష్ లాడ్ కూడా సండూరులో సామాజిక కార్యక్రమాలు వేగవంతం చేశారు. తనసొంత సంస్థ పేరుతో ట్రై సైకిళ్ల పంపిణీ, విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ, పుస్తకాలు, ఇతరత్రా వస్తువుల పంపకాలు వేగంగా చేస్తున్నారు. పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్, సండూరును గెలుచుకోవాలని బీజేపీ రెండూ ఎత్తులు వేస్తున్నాయి. ఇక మాజీ మంత్రి అనీల్ లాడ్ జేడీఎస్‌లో ఉన్నారు. ఆయన జేడీఎస్ నుండి బీజేపీకి సపోర్టు చేయాల్సిందే. మరి ఇక్కడ కొత్త రాజకీయ కిటుకు ఏమంటే సంతోష్ లాడ్, అనీల్ లాడ్ ఇద్దరూ సోదరులే. వీరిలో ఒకరు కాంగ్రెస్‌కు, మరోకరు జేడీఎస్ మద్దతుగా బీజేపీకి ప్రచారం చేయాల్సి వస్తుంది. ఇలాంటి రాజకీయ పరిస్థితులు తలెత్తున్ననేపథ్యంలో సండూరు రాజకీయం చాలా ఆసక్తికరంగా మారింది.. రేపో మాపో మళ్లీ గాలి జనార్దన్‌రెడ్డి సండూరులో పర్యటిస్తామని ప్రకటించారు. మొత్తం మీద సండూరు ఉప ఎన్నికల తేదీ ఖరారు కాకపోయినప్పటికీ అక్కడ రాజకీయవేడి మాత్రం పెరుగుతోంది.

పోలీసు అదుపులో 'గాలి' కారు!

● ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనపై కేసు నమోదు



రోడ్డు డివైడర్‌ను దాటుతున్న జనార్దన్ రెడ్డి కారు..

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 8: మూడు రోజుల క్రితం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య గంగావతి నుంచి బళ్ళారికి వచ్చే సమయంలో ఆయన కాన్వాయ్‌కు వ్యతిరేకదిశలో వాహనాన్ని నడిపినందుకు గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి కారును గంగావతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యమంత్రి వెళుతున్న దారిలో జీరో ట్రాఫిక్ నిమయాలను ఉల్లంఘించి నేరుగా జనార్దన్ రెడ్డి కారు నడుపుతూ ఫుట్‌పాత్‌ను దాటి ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న రోడ్డుపైకి రావడంపై కేసు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌లో ఎవరి పేర్లు నమోదు చేయలేదు. నియమాలు ఉల్లంఘించిన వాహనాలను మాత్రమే గంగావతి ట్రాఫిక్ పోలీసులు తీసుకొచ్చి పంచనామా చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషియల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీనిపై స్పందించిన గాలి జనార్దన్ రెడ్డి బళ్ళారిలో ఏర్పాటు చేసిన హోమంలో పాల్గొనడానికి త్వరగా వెళ్లాల్సి రావడంతో ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. అయినా అప్పటికే అరగంటకు పైగా ట్రాఫిక్‌లో వేచిచూడాల్సి వచ్చిందని, ముఖ్యమంత్రి అయినంత మాత్రాన ఎవరూ ప్రజలను ఇబ్బంది పెట్టరాదని సమర్థించుకున్నారు. అత్యవసరంగా పూజా కార్యక్రమానికి వెళ్లాల్సిన కారణంగా రోడ్డు డివైడర్ దాటానేగాని మరే దురేద్దేశం లేదని, మాధ్యమాలు దీనిని తప్పుగా భావించినట్లు తెలిపారు.

రెండోసారి ఏపీఎంసీ అధ్యక్షుడిగా నాగేంద్రప్ప



అభినందనలు అందుకుంటున్నఏపీఎంసీ అధ్యక్షుడిగా ఎంపికైన నాగేంద్రప్ప

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 8: బళ్ళారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి అధ్యక్షులుగా కట్టిమనె నాగేంద్రప్పను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం తరుపున ప్రభుత్వ అధీన కార్యదర్శి జి.ఎన్.ధనలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. బళ్ళారి ఏపీఎంసికి కావాల్సిన 12మంది సభ్యులతో కూడిన జాబితా విడుదల చేశారు. వీరిలో వ్యవసాయ, వెనుకబడిన విభాగం నుండి కట్టిమనె నాగేంద్రప్ప అధ్యక్షులుగా నియమించింది. నాగేంద్రప్ప రెండోసారి బళ్ళారి ఏపీఎంపి స్థానం దక్కడం విశేషం. ఉపాధ్యక్షులుగా బళ్ళారి తాలూకా పరిధిలోని బి.రామణ్ణ ఎంపికయ్యారు. మిగిలిన పదిమంది సభ్యుల్లో జాలిహాల్ గ్రామానికి చెందిన హస్త పంపనగౌడ, హలకుంది గ్రామానికి చెందిన ముందాలప్ప, యాల్పి, కగల్‌కు చెందిన కుదాన్ సాబ్, హరగినడోణికి చెందిన హెచ్.గవిసిద్దనగౌడ, మహిళా విభాగం నుంచి పారుబాయి, బెళగల్లు గ్రామానికి చెందిన యల్లప్ప, కొర్లగుంది గ్రామానికి చెందిన కె. ప్రభాకర్ రెడ్డి, హందిహాల్ గ్రామానికి చెందిన అబ్దుల్ నజీర్‌సాబ్, శ్రీధరగడ్డ గ్రామానికి చెందిన సిద్దప్ప.ఆర్, వర్తకుల విభాగం నుంచి బళ్ళారి నగరానికి చెందిన బసవరాజులు సభ్యులుగా ఎంపిక అయ్యారు. ఈ ఏడాది మార్చినెలలో ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలు బళ్ళారి ఏపీఎంసి విభజన నిబంధనలో భాగంగా కేవలం మూడు నెలలకే పరిమితం అవధి ముగియడంతో సెప్టెంబరు 2, 2024వ తేదీన పాలనా సమితి అవధి ముగిసిందని డైరెక్టర్ శివానంద్ ఆదేశాలు జారీ చేశారు. నెలరోజు అవధిలోనే తిరిగి బళ్ళారి ఏపీఎంసికి కొత్త పాలనా మండలిని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీచేయగా, మరోసారి అధ్యక్ష స్థానం కట్టిమనె నాగేంద్రప్ప దక్కించుకోవడం విశేషం.

కన్నడ రథయాత్రకు సన్నాహాలు



మాట్లాడుతున్న ఏసీ ప్రమోద్ తదితరులు

బళ్లారి సిటీ, అక్టోబరు 8: 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సదస్సులో భాగంగా కన్నడజ్యోతి రథయాత్ర ఈనెల 19, 20 తేదీల్లో జిల్లాలో పర్యటించనుంది. అందుకుగాను ముందస్తు సన్నాహాలు చేసుకోవాలని ఏసీ ప్రమోద్ అధికారులకు సూచించారు. కన్నడ రథయాత్ర నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్ల కోసం మంగళవారం జిల్లానూతన యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 19, 20 తేదీల్లో సిరుగప్ప తాలూకాకు రథయాత్ర వస్తుందని, కన్నడ రథయాత్రకు తాలూకా యంత్రాంగం స్వాగతం పలకాలన్నారు. ఈసమావేశంలో వివిధ కన్నడ సంస్థల పదాధికారులు కన్నడ రథయాత్ర విజయవంతానికి తమ సూచనలను అందించారు.

జేడీఎస్ సభ్యత్వ అభియానకు శ్రీకారం



జేడీఎస్ సభ్యత్వ అభియాన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రాజనాయక

గంగావతి రూరల్, అక్టోబరు 8: జేడియస్ పార్టీ యువ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ నాయక అధ్వర్యంలో మంగళవారం ఆనెగొంది గ్రామంలో జేడియస్ పార్టీ సభ్యత్వ అభియాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి గంగావతి నియోజవర్గంలో 20వేల మందిచేత జేడియస్ పార్టీలో సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎక్కువగా యువత జేడియస్ పట్ల మొగ్గు చూపుతున్నారన్నారు. వచ్చే జిల్లా పంచాయతీ ఎన్నికల్లో జేడియస్ పార్టీ పరంగా అభ్యర్థులను బరిలో దించుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల విసుగు చెందిన ప్రజలు జేడీఎస్‌వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

ధనలక్ష్మిగా తాయమ్మ దేవి


జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో వివిధ అలంకారాలలో భక్తులను అనుగ్రహించిన అమ్మవారు



ధనలక్ష్మీగా సిరుగుప్ప తాయమ్మదేవి



ఆనెగొంది దుర్గాదేవి..



ప్రత్యేకాలంకరణలో ఉలిగమ్మదేవి



కొబ్బరి అలంకరణలో ఎర్రితాత

అభివృద్ధి పేరుతో నీడనిచ్చే 39 చెట్ల నరికివేత

కంప్లి, అక్టోబరు 8 : అడవుల్లో నుంచి కాస్త చెట్లకొమ్మలు బయటకు వచ్చినా కేసులు నమోదు చేస్తారు. అలాంటిది విజయనగర జిల్లా హగరి బొమ్మనహళ్లిలోని రామ్‌నగర్ కాలనీ తేరు వీధిలోని రోడ్డు, మురుగు కాలువల నిర్మాణం కోసం కొన్నిసంవత్సరాలుగా బాటసారుల సేదతీర్చుతున్న సుమారు 39 చెట్లను నరికివేశారు. అభివృద్ధి పేరుతో కాలనీకే నీడనిచ్చేచెట్లనే కూల్చివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా కాకుండా ఇక ముందు ఎక్కడైనా చెట్లను తొలగించాలంటే ఆ మేరకు మొక్కలు నాటి ఆ చెట్లను తీసి వేయాలన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రాంతాల్లో చెట్లు లేకపోవడంతో సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మొదటగా ప్రకృతిపై దృష్టిసారించి అనంతరం అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానికులు కోరారు.

వాస్కోడిగామాకు నూతన రైలు ప్రారంభం

కంప్లి, అక్టోబరు 8: ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు నూతన రైలును బుధవారం నుండి ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైలు నెంబర్ 17040 ప్రతి గురువారం, శనివారం సికింద్రాబాద్ నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి బళ్లారి, హోస్పేట మీదుగా ప్రయాణించి సాయంత్రం 5 గంటలకు గోవాకు చేరుకుంటుందన్నారు. గోవాలో ఉదయం 6 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు 6.20 గంటలకు చేరుకుంటుందన్నారు.

అలుపెరగని కృషితోనే పోటీ పరీక్షల్లో విజయం: డీసీ



మాట్లాడుతున్న జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, అక్టోబరు 8: విద్యార్థులు, ఉద్యోగార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని కన్నడ సాంస్కృతిక శాఖలో కేపీఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. నేటి ప్రపంచం పోటీతో కూడుకున్నదని, కనుక విద్యార్థులు, ఔత్సాహికులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. విజయం సాధించాలంటే రోజుకు 5నుంచి 6గంటలపాటు ఏకాగ్రతతో చదవడం అవసరమన్నారు. జిల్లాపంచాయితీ ముఖ్యకార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, ఆలోచనలు సమాచారాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఔత్సాహికులు తమ కరెంట్ అఫైర్స్ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి వార్తాపత్రికలు చదివే అలవాటును పెంపొదించుకోవాలన్నారు. బళ్లారి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు వీలుగా డీఎంఎఫ్ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేపీఎస్ పరీక్ష ఉచిత ప్రీ ట్రైనింగ్ కోసం మొత్తం 192మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారికి 5నెలల పాటునగరంలోని కన్నడ సాంస్కృతిక శాఖలో ఉదయం 8-30 నుండి మధ్యాహ్నం 2-30 వరకు శిక్షణ ఇస్తామన్నారు.

హోసూరు జోన్

ప్రభుత్వ తీరుపై అన్నాడీఎంకే మానవహారం



నిరసనలో అన్నాడీఎంకే నాయకులు

హోసూరు అక్టోబరు 8: ప్రభుత్వం నిరంతరం ఆస్తిపన్ను పెంచడం పట్ల అన్నాడీఎంకే తరపున హోసూరు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో మంగళవారం నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. బాగలూరు రోడ్డులోని ఎన్‌జీఓఎస్ కాలనీ, రైల్వేస్టేషన్, రాయకోట రోడ్డులోని విద్యుత్ కార్యాలయం ముందు, బెంగళూరు చెన్నై జాతీయరహదారిపై ఆయా ప్రాంతీయ కార్యదర్శులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అశోక్‌రెడ్డి, మంజునాథ్, రాజీ, వాసుదేవన్ సమక్షంలో మానవహారం ఏర్పాటుచేశారు. నిరసన కార్యక్రమంలో రాజ్యసభ కార్యదర్శి ఎంపీ తంబిదురై పాల్గొని ప్రత్యేక ప్రసంగం చేసి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులను అడ్డూఆపూ లేకుండా పెంచుతున్నారన్నారు. అలాగే యువత డ్రగ్స్ తీసుకుంటూ వారి వారి జీవితాన్నే కోల్పోతున్నారన్నారు. చెన్నై బీచ్‌లో రక్షణ శాఖ నిర్వహించిన ఎయిర్ అడ్వెంచర్ కార్యక్రమంల్లో ఐదుగురు మరణించారని వారికి ఆత్మశాంతి కలగాలన్నారు. ఈ పోరాటంలో ఎంజీఆర్ మండలి జిల్లా కౌన్సిల్ జిల్లా కార్యదర్శి మాదయ్యన్, జిల్లా కార్యదర్శి రాము, అన్నా ట్రేడ్ యూనియన్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ప్లీజ్ కాల్ 18002021989

● ఆది ద్రావిడ గిరిజన తెగల వారి కోసం టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 8: కృష్ణగిరి జిల్లాలోని ఆది ద్రావిడ గిరిజన తెగలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ టెలిఫోన్ నంబర్ 18002021989 లేదా 14566కు కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు తెలిపారు. ఆది ద్రావిడర్ గిరిజనులకు న్యాయమైన సలహాలను అందించడానికి, సాంకేతిక సదుపాయాలతో కూడిన సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆది ద్రావిడర్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి 2023-2024 శాసనసభలో ప్రకటించారన్నారు. దాని ఆధారంగా, తమిళనాడుల్లో కుల హింసకు గురవుతున్న ఆది ద్రావిడ గిరిజన తెగలకు చెందిన వ్యక్తులు తమ సమస్యలను టోల్-ఫ్రీ టెలిఫోన్ నంబర్లు ద్వారా తెలియజేయవచ్చునన్నారు.

500 కిలోల గుట్కా ఉత్పత్తుల స్వాధీనం

హోసూరు(క్రైం) అక్టోబరు 8: హోసూరు సమీపంలోని బాగలూరులో సుమారు 500 కిలోల గుట్కా ఉత్పత్తులను బాగలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోసూరు సమీపంలోని బాగలూరు జంక్షన్ ప్రాంతంల్లో బాగలూరు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ నేతృత్వంల్లో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా, ఆ సమయంల్లో కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు ఓ కారు వేగంగా వచ్చింది. అది ఆపమని చెప్పినా ఆపకపోవడంతో అతివేగంతో ఆపమని చెప్పడంతో డ్రైవర్ కారును అక్కడే ఆపి పరారయ్యాడు. కారులో సోదా చేయగా అందులో నిషేధిత గుట్కా ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించారు. 519 కిలోల బరువున్న 70 బస్తాల గుట్కా ఉత్పత్తులు ఉన్నట్లు తెలిసింది. పోలీసులు పొగాకు సంచులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. పరారీల్లో ఉన్న దుండగుల కోసం గాలిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత గుట్కా పాకెట్ల మూటలు

నవలి ఆనకట్ట నిర్మాణంపై త్వరలో సీఎంల సమావేశం



ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

రాయచూరు, అక్టోబరు 8: రాష్ట్రంలో కొత్తగా నిర్మించతలపెట్టిన నవలి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి త్వరలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. దసరాఉత్సవాల్లో పాల్గొనేందుకు మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జిల్లాలోని సింధనూరు మార్కెట్‌యార్డ్ ఆవరణలో నిర్వహిస్తున్న రైతు దసరా ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తుంగభద్ర డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 102 టీఎంసీలు కాగా 33 టీఎంసీల పరిమాణంలో పూడిక పెరుకుపోయిందన్నారు. ఈనేపథ్యంలో ఆ మేరకు సాగునీటిలో వాటాను నష్టపోకుండా ప్రత్యామ్యాయంగా నవలి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇంజనీరింగ్ నిపుణులు తగిన విధివిధానాలు ఖరారు చేశారని, దీని పై మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. అదే సమయంలో తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగి 70 ఏళ్లు దాటిన నేపథ్యంలో ఇటీవల జరిగిన చేదు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరలోనే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనల మేరకు డ్యాం అన్ని గేట్‌లను మార్చనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. డ్యాంలో నీటినిల్వ తగ్గిపోయిన అనంతరం పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. కాగా 19వ క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన సందర్భంగా వారం రోజుల్లోగా పనులు పూర్తి చేసి మొత్తం దేశం దృష్టిని ఆకర్షించామన్నారు.

చేసే పనుల వల్లే అధికారులకు గుర్తింపు



మాంతేష్‌ను సన్మానిస్తున్న అధికారులు

కంప్లి, అక్టోబరు 8: ఏ ప్రభుత్వ అధికారికయినా, చేసే విధుల వల్లే గుర్తింపు వస్తుందని భూసర్వే ఏడీఎల్ఆర్ నరసప్ప తెలిపారు. కంప్లి పట్టణం భూసర్వే శాఖలో సూపర్‌వైజర్‌గా ఉన్న మాంతేష్ హరిహరకు బదిలీ కావడంతో ఆయనను శాలువాలు, పూలమాలలతో మంగవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఆయన సుమారు 18 యేళ్ల పాటు విధులు నిర్వహించారని, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, షణ్ముఖప్ప, అనిల్, ఆనందప్ప, తిప్పేస్వామి, మోహన్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

నికోలస్ రోరిచ్ (జయంతి)



రష్యా దేశ చిత్రకారుడు, రచయిత, ఫిలాసఫర్‌గా ఉన్న నికోలస్ రోరిచ్ 1874 అక్టోబరు 9న జన్మించారు. కళలమీద ఇష్టంతో సహజత్వం ఉట్టిపడే ఎన్నో కళాఖండాలను చిత్రీకరించారు. భారతీయ సంస్కృతిపై మక్కువను పెంచుకున్న ఆయన రవీంద్రనాథ్ ఠాగూర్ కవిత్వం, భగవద్గీత అంటే ఎంతో ఇష్టపడేవారు. పలుమార్లు ఆయన పేరు నోబెల్ శాంతి పురస్కారానికి ప్రతిపాదించబడింది. ఆయన భారతదేశంలోనే 1947 డిసెంబరు 13న కన్నుమూశారు.

మొక్కపాటి నరసింహశాస్త్రి (జయంతి)



తెలుగు హాస్య రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి 1892 అక్టోబరు 9న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా గండ్రేడు గ్రామంలో జన్మించారు. ఆయన రాసిన 'బారిస్టర్ పార్వతీశం' తెలుగు హాస్యరచనలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ నవల మూడు భాగాలుగా వెలువడింది. ప్రకాశం పంతులు గారితో భేటీ అనంతరం స్వాతంత్రోద్యమంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఏకోదరులు, మొక్కుబడి, అభ్యుదయం, పెద్దమామయ్య, అసాధారణ సమావేశం, వారసత్వం వంటి రచనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. 1973లో కన్నుమూశారు.

జాన్ లెన్నన్ (జయంతి)



ఆంగ్ల గాయకుడు జాన్ లెన్నన్ 1940 అక్టోబరు 9న ఇంగ్లండ్ దేశం లివర్ పూల్ ప్రాంతంలో జన్మించారు. ఆయన గురించి తెలియని సంగీత ప్రియులు ఉండరంటే అతిశయోక్తి కాదు. పాటల రచయితగా, రికార్డుల నిర్మాతగా కూడా ఆయన పేరు గడించారు. ఆయన రాసిన ఎన్నో పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. 'బీటిల్స్' పేరిట సంగీత గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. బ్రిట్ పురస్కారం, తదితర అవార్డులు అందుకున్నారు. 40 ఏళ్ళ ప్రాయంలో 1980 డిసెంబరు 8న ఆయనను దుండగులు హత్య చేశారు. మరణానంతరం 'గ్రామీ' పురస్కారం ప్రకటించారు.

ఉస్తాద్ అమ్జాద్ అలీఖాన్ (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత ఉస్తాద్ అమ్జాద్ అలీఖాన్ 1945 అక్టోబరు 9న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ ప్రాంతంలో జన్మించారు. సరోద్ సంగీత వాద్య విద్వాంసుడిగా ఆయన దేశ విదేశాల్లో లెక్కకు మిక్కిలి కచేరీలు నిర్వహించారు. సరోద్ అంటేనే అమ్జాద్ అలీఖాన్ పేరు గుర్తొచ్చేలా ఎదిగారు. ఆయన కుమారులు అయాన్, అమాన్‌లు కూడా సరోద్ వాదనలో రాణిస్తున్నారు. ఉస్తాద్ ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలతో గౌరవించింది. సంగీతనాటక అకాడమీ ఇతర అవార్డులు పొందారు.

ఒలివర్ హార్ట్ (పుట్టినరోజు)



ఒలివర్ సైమన్ డి ఆర్సీ హార్ట్ 1948 అక్టోబరు 9న జన్మించారు. బ్రిటీష్‌లో జన్మించిన అమెరికా ఆర్థికవేత్త. హార్వర్డ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. కంట్రాక్టు థియరీ, థియరీ ఆఫ్ ది ఫర్మ్, కార్పొరేట్ ఫైనాన్స్, లా అండ్ ఎకనామిక్స్‌లపై నిపుణులు. 2016లో ఆర్థికశాస్త్రంలో నోబెల్ ప్రైజ్ అందుకున్నారు. ఓనర్‌షిప్ స్ట్రక్చర్ అండ్ కాంట్రాక్చుయల్ అరేంజ్‌మెంట్స్ అనే అంశాలపై ఆయన చేసిన పరిశోధనలు ప్రభుత్వంలోనూ, సంస్థలలోనూ అమలు చేశారు.

ఎస్‌పీ శైలజ (పుట్టినరోజు)



శ్రీపతి పండితారాధ్యుల (ఎస్‌పీ) శైలజ 1962 అక్టోబరు 9న నెల్లూరులో జన్మించారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మళయాళ భాషల సినిమాల్లో 5వేలకుపైగా పాటలు పాడారు. గాయనిగానే కాక డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్‌పీ బాలసుబ్రమణ్యం సోదరి. శాస్త్రీయనృత్యంలో శిక్షణ పొందిన ఆమె, దర్శకుడు కే విశ్వనాథ్ రూపొందించిన 'సాగర సంగమం'లో నాట్యంచేసే పాత్రలో నటించారు. పలు బుల్లితెర కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

దాడి ఆరోపణలతో ముగ్గురి నిందితుల అరెస్టు

శిడ్లఘట్ట, అక్టోబరు 8: పట్టణంలో మారణాయుధాలతో ప్రజలలో భయం కల్గిస్తూ ఒక వ్యక్తిపై దాడి చేసి ప్రాణాలు తీస్తామని బెదరించిన ఆరోపణలతో శిడ్లఘట్ట టౌన్ పోలీసులు ఒక రౌడీషీటర్ సహా ముగ్గురిని అరెస్టు చేశారు. శిడ్లఘట్ట పట్టణంలోని గాంధీనగర్ నివాసి రౌడీషీటర్ సునిల్ అలియాస్ డ్యాడి, అతడి సోదరుడు శామంత్ కుమార్, మరో వ్యక్తి శ్రీధర్‌లు అరెస్టు అయినవారు. కద్రిపాళ్యకు చెందిన మురళి ఒక దుకాణం వద్ద నిల్చుని ఉండగా నిష్కారణంగా రౌడీషీటర్ సునిల్ ఇష్టం వచ్చినట్టు తిడుతూ దాడి చేయడమే కాక బెదరించాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఎస్పీ కుశల్‌చౌక్సి నేతృత్వంలో కార్యాచరణ నిర్వహించిన నిందితులను అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

కూలిన భారీ వృక్షం

విజయపుర, అక్టోబరు 8: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని సంత మైదానంలో వందల ఏళ్ళ రావి చెట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. సోమవారం రాత్రి ఈదురుగాలుల కారణంగా కూకటివేళ్లతో సహా చెట్టు కూలిపోయింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. సంతమైదానంలో వేణు గోపాలస్వామి ఆలయం పక్కన సుమారు 200ఏళ్ల నాటి రావి చెట్టు కూలింది. పురసభ దుకాణం గోడపై చెట్టు కూలడంతో పాక్షికంగా నష్టం వాటిల్లిందని ఇతర సమస్యలు తలెత్తలేదని పురసభ ముఖ్యాధికారి సంతోష్ తెలిపారు. ఆలయంపై కూలి ఉంటే నష్టం అపారంగా ఉండేదన్నారు. కూలిన చెట్టును కొమ్మలుగా చేసి తొలగించనున్నట్టు తెలిపారు. కాగా ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న చెట్టు అకస్మాత్తుగా కూలడంపై స్థానికంగా చర్చనీయాంశమైంది.

మోహిని రూపంలో శారదాదేవి



మోహిని అలంకరణలో శృంగేరి శారదాదేవి



కరుమారియమ్మ అలంకరణలో గిరినగర్ వాసవీమాత



గౌడనపాళ్యలో దుర్గమ్మ దేవి



శాకంబరి అలంకరణలో దొడ్డజాల ముత్యాలమ్మదేవి

బెంగళూరు అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో ఆరోరోజు నాడదేవత మైసూరు చాముండేశ్వరి దేవి మంగళవారం ఇంద్రాణి అలంకరణలో దర్శనమిచ్చారు. మూలవిరాట్టుకు విశేష పూజల అనంతరం ఉత్సవమూర్తికి ప్రాకారోత్సవం నిర్వహించారు. నగరంలోని ప్రముఖ శక్తి ఆలయాలలో ఒకటైన బనశంకరి దేవి మంగళవారం గోమతి చక్రాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గిరినగర్‌లోని వాసవిమాతకు కరుమారియమ్మ రూపంలో అలంకరణ చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన దేవనహళ్ళి తాలూకాలోని దొడ్డజాల గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ దేవి ఆరోరోజు శాకంబరి అలంకరణ చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని తీర్చిదిద్దారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. కాగా శృంగేరిలోని శారదాదేవి ఆలయంలో అమ్మవారు మోహినిదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. అభినవ విద్యాతీర్థ మహాస్వామి నేతృత్వంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు, పూజలు కొనసాగాయి. కాగా శిడ్లఘట్ట పట్టణంలోని కాళికాంబ కమటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి విశేషపూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కన్నడ రాజ్యోత్సవానికి తీర్మానం



సన్నాహక సభలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, అక్టోబరు 8: ఈసారి కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా తీర్మానించారు. కన్నడ భవన నిర్మాణంపై చర్చించేందుకు కన్నడ సంఘం, కన్నడ పర సంఘాలు, దళిత సంఘాలు సభలో చర్చించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని తాలూకా కార్యాలయ సభాంగణం జాతీయ పండుగల సమితి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి, కన్నడ రాజ్యోత్సవ సన్నాహకసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40ఏళ్లక్రితం పురసభ నుంచి కన్నడ భవనానికి స్థలాన్ని గుర్తించి కేటాయించినా ఇంతవరకు భవనం నిర్మాణం కాకపోవడం విచారకరమన్నారు. కేవలం రాజ్యోత్సవం రోజును మాత్రమే అక్కడ ఆచరిస్తున్నారన్నారు. ఇకనైనా కన్నడ సంఘాల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు సభ్యులు, దళిత సంఘాలతో చర్చించాక ఒకవేళ వారికి కన్నడ భవనం నిర్మాణం సాధ్యంకానిపక్షంలో తనవంతు నిధులు ఇస్తానని, అంతేకాక విరాళాలు సేకరించి నిర్మిస్తామన్నారు. ఈ సంవత్సరం కూడా పురసభ కార్యాలయంలో 9.30 గంటలకు ధ్వజారోహణ, సమావేశం అనంతరం పురవీధులలో ఊరేగింపు ఉంటుందన్నారు. అధికారులందరూ సహకరించాలని, ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా పల్లకీలతో భాగస్వామ్యం కావాలన్నారు. వాల్మీకి జయంతి కూడా పురసభ ఆవరణలో ఘనంగా నిర్వహించేలా సంఘం ప్రముఖులు తీర్మానించారన్నారు. పురసభ అధ్యక్షుడు గోవింద, సభ్యులు వెంకటేశ్, తహసీల్దార్ వెంకటేశప్ప, తాలూకా పంచాయతీ ఈఓ రవి కుమార్, బీఈఓ గురుమూర్తి, పురసభ ముఖ్య అధికారి సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కళలు కత్తెరలా కాదు.. సూదిలా ఉండాలి

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కళలు కత్తెరలా కాకుండా సూదిలా ఉండాలని ప్రముఖ గాయకుడు కడబగెరె మునిరాజు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ విద్యార్థుల తొలి ఏడాది కోర్సులతో పాటు సాంస్కృతిక కలాపాలకు మంగళవారం లాంఛనంగా ఆరంభించారు. ప్రిన్సిపాల్ వీటీ శ్రీనివాసనాయక అధ్యక్షత వహించగా పారా అథ్లెటిక్ ఫెడరేషన్ అధ్యక్షులు సత్యనారాయణ ముఖ్యులుగా పాల్గొన్నారు. కళలు సమాజంలో అందరినీ కలుపుకుపోయే రీతిలో సూదిలా ఉండాలన్నారు. కళాశాలలో కోర్సేళ్ళుగా చదవుతో పాటు కళలకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. రాష్ట్రస్థాయి సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు మనిషికి అవసరమని అదే తరహాలోనే క్రీడా మనోభావాలు పెంపొందింప చేసుకోవాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కమిటీ సంచాలకులు డాక్టర్ శశికళతో పాటు కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ దరంగితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తరగతుల ప్రారంభంలో గాయకుడు కడబగెరె మునిరాజు తదితరులు

పచ్చదనం పెంపే లక్ష్యం

శిడ్లఘట్ట, అక్టోబరు 8: పచ్చదనం పెంపే లక్ష్యమని బెంగళూరుకు చెందిన మేపల్ ట్రీ కంపెనీ, వృక్ష ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. తాలూకాలోని చిక్కదాసరహళ్ళిని బ్యాటరాయస్వామి మాన్యం భూములలో వివిధ రకాల 5వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మళమాచనహళ్ళి పీడీఓ శైల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ 11 ఎకరాల 26 గుంటల భూమి బంజరుగా ఉండడాన్ని గుర్తించి పచ్చదనం పెంచేలా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. మేపల్ ట్రీ కంపెనీకి చెందిన విజయకుమార్ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో ప్రతి ఏడాది అనేక పాఠశాలలు, ఆసుపత్రులకు సాయం చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈసారి పర్యావరణ కోసం కృషి చేస్తున్నామన్నారు. బ్యాటరాయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బ్యాటరాయశెట్టి, వృక్షఫౌండేషన్ సభ్యులు, మేపల్ ట్రీ కంపెనీకి చెందిన మోహన్, శ్రీగంధ, పుష్కర్, సింబు, గణేశ్, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజా సంఘాల సభ్యులు

రావుస్ ద్వారా ఉచిత మోడల్ ప్రశ్నపత్రాలు

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రావుస్ అకాడమీ హైస్కూల్ విద్యార్థులకు వర్క్ బుక్స్, ప్రశ్నాపత్రాలను ఉచితంగా అందచేస్తోంది. 8-10 తరగతుల సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ విద్యార్థులందరికీ మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందచేస్తున్నట్టు ప్రకటించింది. విద్యార్థులలో పరీక్షల పట్ల అవగాహన, చదువుకునే విధానంలో నైపుణ్యత సాధించాలనే ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు అనుగుణంగా ప్రశ్నాపత్రాలను రూపొందించినట్టు ప్రకటించారు. రావుస్ అకాడమీ ద్వారా మోడల్ క్వశ్చన్ పేపర్‌లను వర్క్‌బుక్స్ కొనుగోలు చేసేవారికి ఉచితంగా ఇవ్వదలిచారు. జనవరిలో విద్యాశాఖ విడుదల చేసే బ్లూప్రింట్ ఆధారంగా వీటిని రూపొందించదలిచారు. ప్రతి ఏటా ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో 5వేలమందికి పైగా ఏ, ఏప్లస్ ర్యాంకులు సాధించేందుకు వర్క్‌బుక్స్ ప్రయోజనం కానున్నాయన్నారు. క్వశ్చన్ పేపర్‌లను వర్క్‌బుక్‌లను రూపొందించేవారు సమగ్రంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సమస్యలను పరిష్కరించేలా పొందుపరిచి ఉంటారన్నారు. బసవనగుడిలోని అకాడమీకి సంబంధించి 9900575990 ద్వారా సంప్రదించవచ్చునన్నారు.

చిల్లర వ్యాపారుల నిరసన

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ రాజ్ పేరిట కఠిన చట్టాలతో ఇబ్బంది కలిగించేందుకు సిద్ధమైన ప్రభుత్వ వైఖరిని చిల్లర వ్యాపారులు నగరంలో భారీ నిరసన తెలిపారు. మంగళవారం ఫ్రీడంపార్కులో పెద్దసంఖ్యలో వ్యాపారులు చేరుకున్నారు. రాష్ట్ర చిల్లర బీడీ సిగరెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు బీఎస్ మురళీకృష్ణ మాట్లాడుతూ లైసెన్సులు లభించడం ఇక చిన్న వ్యాపారులకు కష్టంగా మారనుందన్నారు. కఠిన నిబంధనలతో అధికారులనుంచి వ్యాపారులకు వేధింపులు ఉంటాయన్నారు. పొగాకు విక్రయాలకు సంబంధించి కోప్టా యాక్ట్ ఇప్పటికే అమలులో ఉండడంతో కొత్త నిబంధనలు అవసరం లేదని అభిప్రాయపడ్డారు. వ్యాపారస్తుల నుంచి పన్నులరూపంలో భారీగా ఆదాయం పొందుతున్నప్పటికీ నిబంధనల పేరిట ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వేలసంఖ్యలో వ్యాపారులు నిరసనలో పాల్గొన్నారు.



ఫ్రీడం పార్కులో వ్యాపారుల నిరసన

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి



శిడ్లఘట్టలో ప్రసంగిస్తున్న పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి

మహదేవపుర, అక్టోబరు 8: నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలు దృష్టి సారించాలని మాజీ మంత్రి అరవింద లింబావళి సూచించారు. హూడిలో కార్యకర్తల సభ్యత్వ అభియానలో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా ఉన్న బీజేపీ పదికోట్లమంది సభ్యులను పెంచే లక్ష్యంతో అభియాన చేపట్టామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్టీని, దేశాన్ని బలోపేతం చేసేందుకు వికసిత భారత దిశగా దేశవ్యాప్తంగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంజుళా తదితరులు పాల్గొన్నారు.



మహదేవపురలో కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి లింబావళి

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: బీజేపీ పట్ల అధికార కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా కార్యకర్తలు శ్రమించాలని పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తెలిపారు. పట్టణంలో ఏర్పాటైన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పార్టీ పదాధికారులతో చర్చలు జరిపారు. రాజ్యాంగ వ్యతిరేకి, దళిత వ్యతిరేకి, రిజర్వేషన్‌లకు వ్యతిరేకమంటూ బీజేపీ పట్ల చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. బీజేపీని దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలు ఆదరించడంతోనే కేంద్రంలో అధికారం సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. శిడ్లఘట్టలో సుమారు 23వేల మంది సభ్యులయ్యారని గడువులోగా లక్ష్యం మేరకు 50వేలకు చేరేందుకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప, సీకల్ రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, ఆనంద గౌడ, కంబదహళ్ళి సురేంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

నైరుతి రైల్వే ఉద్యోగుల ర్యాలీ

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): నైరుతి రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో హుబ్బళ్ళిలో భారీ ర్యాలీ చేశారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సంఘ్ సిద్ధమైనట్టు ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్ ప్రకటించారు. హుబ్బళ్ళిలో సోమవారం జరిగిన ర్యాలీకి 3వేల మంది ఉద్యోగులు పాల్గొనడం సంతోషమన్నారు. ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్, ఉపాధ్యక్షులు చన్నబసప్ప నేతృత్వంలో డివిజనల్ రైల్వే ఉన్నతాధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఎన్నికల్లో సంఘ్ సమష్టిగా పనిచేయనున్నట్టు ప్రకటించారు.



నామినేషన్ సమర్పణ



రైల్వే ఉద్యోగుల ర్యాలీ

విద్యార్థికి క్రికెటర్ కేఎల్ రాహుల్ సాయం



క్రికెటర్ కేఎల్ రాహుల్, విద్యార్థి అమృత్

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇండియన్ క్రికెటర్, కన్నడిగుడు అయిన కేఎల్ రాహుల్ బాగల్కోటె జిల్లా మహాలింగపుర గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి చదువుకు సాయం చేశారు. హుబ్బళ్ళిలోని బీవీబీ కళాశాల క్యాంపస్‌లో అమృత్ మావినకట్టి బీకామ్ చదువుతున్నాడు. హుబ్బళ్ళికి చెందిన సామాజిక కార్యకర్త మంజునాథ్ హెబసూరు ద్వారా రాహుల్ సాయం చేశారు. తొలి ఏడాదిలో చేరినప్పుడే కేఎల్ రాహుల్ సంపూర్ణంగా ఫీజులు చెల్లించారు. ప్రస్తుతం బీకామ్ రెండో సంవత్సరానికి సంబంధించి రూ.75వేల ఫీజును చెల్లించారు. ఇదే విషయమై అమృత్ మావినకట్టి సోమవారం మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది క్రికెటర్ రాహుల్ చదువుకు సాయం చేశారని అత్యధిక మార్కులు వస్తేనే ఫీజు చెల్లిస్తానని సూచించారన్నారు. 9.3 సీజీపీఏ పొందానని, విషయం తెలిసిన మేరకు క్రికెటర్ రాహుల్ రెండో ఏడాది కూడా ఫీజులు చెల్లించారన్నారు. చదువుకు కేఎల్ రాహుల్, మంజునాథ్ హెబసూరల సహకారం మరువ లేనన్నారు.

అందానికి మగువలు ప్రాధాన్యం

» నటి మలైకా అరోరా

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అందానికి మగువలు ప్రాధాన్యత ఇస్తారని అది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రముఖ బాలీవుడ్ నటి మలైకా అరోరా అభిప్రాయపడ్డారు. నగరంలోని కోణనకుంటె ఫోరం సౌత్‌మాల్‌లో పేజ్3 బ్యూటీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ శరీరంపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. చర్మ సౌందర్యానికి నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. పేజ్3 సీఈఓ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఏడాదికి మరిన్ని శాఖలు తెరవదలిచామన్నారు. 2023లో 28 బిలియన్ డాలర్ల మార్కెట్‌లో 5.6శాతం సాధించామన్నారు.

నాణ్యత పాటించాలి..

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ముత్యాలు సంస్కృతిలో సంప్రదాయమైనవని నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని జగదాంబ పెర్ల్స్ సీఈఓ అవినాశ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ఫోరం సౌత్‌లో నాల్గోశాఖను లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నిజాం పాలనలో 1924లో పెర్ల్స్ దుకాణం ప్రారంభించామని వందేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. స్త్రీ పురుషులతోపాటు అందరూ ముత్యాలు ధరించవచ్చునన్నారు. బెంగళూరులో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండాలనే శాఖను తెరిచామన్నారు. మరో సీఈఓ యశ్ అగర్వాల్‌తోపాటు మార్కెటింగ్ ముఖ్యులు దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

అమరాపురం, అక్టోబరు 8 : మండల పరిధిలోని బసవనపల్లిలో మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనానికి లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన మేరకు.. బసవనపల్లి గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా నిడిగల్లు హోబళి చిక్కబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి(48) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.